పోలింగ్ కేంద్రాల జాబితా ప్రదర్శన

శంషాబాద్ రూరల్: పంచాయతీ ఎన్నికల సన్నాహాల్లో భాగంగా పోలింగ్ కేంద్రాల డ్రాఫ్ట్ వివరాలను మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ప్రదర్శించారు. సర్పంచు, వార్డు సభ్యుల ఎన్నికల కోసం ఆయా పంచాయతీల పరిధిలోని పోలింగ్ కేంద్రాల వివరాలను ఇందులో పొందుపర్చారు. ఈ జాబితాపై అభ్యంతరాలను ఈ నెల 12వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు మండల పరిషత్ కార్యాలయంలో స్వీకరిస్తారు.

ఆరోగ్యకర జీవనానికి మొక్కలు నాటాలి

మణికొండ: ఆరోగ్యకర జీవనానికి మొక్కలు నాటాలని మణికొండ మున్సిపాలిటీ, 7వ వార్డు నెక్నాంపూర్ కౌన్సిలర్ బి.పద్మారావు అన్నారు. శనివారం తన వార్డు పరిధిలోని వెంకటేశ్వరకాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బి. ఉపేంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో కాలనీవాసులు చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ సమతుల్యత, పర్యావరణ కాలుష్యం మొక్కలు, వృక్షాలతో తగ్గి ప్రజలు ఆరోగ్యంగా జీవించే అవకాశం కలుగుతుందన్నారు. ఇప్పటికే వాయు కాలుష్యం పెరిగిపోవడంతో ప్రజలకు అనేక రకాల రోగాలు వస్తున్నాయని, వాటిని తగ్గించుకుని ఆరోగ్య జీవితాన్ని కోరుకునే వారు పెద్ద ఎత్తున మొక్కలను నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు ప్రభాకర్‌రావు, అఖిల్, షేక్ ఆరీఫ్, సందీప్, రాజారెడ్డి, జస్వంత్, శేషు, విశ్వనాథ్, జగదీష్, సుజాత, రూప, విజయలక్ష్మి, రాధిక, లావణ్య, శ్యామల, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేస్తా

రంగారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కొండకళ్ల నాగేందర్‌రెడ్డి


ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కొండకళ్ల నాగేందర్‌రెడ్డి

అత్తాపూర్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలిచేలా అభివృద్ధి చేస్తున్నారని రంగారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కొండకళ్ల నాగేందర్‌రెడ్డి అన్నారు. ఇటీవల జరిగిన జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికల్లో కొండకళ్ల నాగేందర్‌రెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధించారు. ఈ సందర్భంగా శనివారం తెలంగాణ స్పోర్ట్స్ చైర్మన్ శివసేనారెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ముఖ్యమంత్రితో సమావేశమై జిల్లాలో చేపట్టబోయే కార్యక్రమాలపై నాగేందర్‌రెడ్డి వివరించారు. ఈ సందర్భంగా తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాగేందర్‌రెడ్డి మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లాలో యువజన కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయడంతో పాటు అనేక కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి అభివృద్ధి, సంక్షేమ పథకాన్ని అర్హులైన ప్రతి గడపకు అందించేందుకు తమ సాయశక్తుల కృషి చేస్తానన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన వారిలో తెలంగాణ స్పోర్ట్స్ చైర్మన్ శివసేనారెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్ష అభ్యర్థి జెక్కిడి శివచరణ్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి శ్రావణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్


మాట్లాడుతున్న ప్రకాశ్‌గౌడ్

మణికొండ: నియోజకవర్గంలోని అన్ని వర్గాలు, అన్ని మున్సిపాలిటీల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామని, అందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్ అన్నారు. శనివారం సాయంత్రం ఆయన నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని 6, 9, 10, 14, 15 వార్డులలో రూ.14.25 కోట్లతో చేపట్టిన మహిళా శక్తి క్యాంటీన్, సర్కిల్‌లు, పార్కు, సీసీ రోడ్లు, డ్రైనేజీ లాంటి అభివృద్ధి పనులను ఆయన రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బి.జ్ఞానేశ్వర్, టీయుఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నరసింహారెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల అభ్యున్నతి, సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. అందులో భాగంగానే నియోజకవర్గం పరిధిలోని అన్ని మున్సిపాలిటీల అభివృద్ధి కొనసాగుతుందన్నారు. మహిళలు ఆర్థికంగా రాణించాలనే ఉద్దేశంతో వారికి క్యాంటీన్‌లను పెట్టించి ప్రోత్సహిస్తుందన్నారు. వాటిని సక్రమంగా నిర్వహించి మరింత మందికి ఉపాధి కల్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎం.నాగపూర్ణ శ్రీనివాస్, కమిషనర్ టి. కృష్ణమోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ విజయ్‌బాబు, ప్రజా పాలన విజయోత్సవాల ఇంచార్జి ఇందిరాశోభ, డీఈ నరేష్ కుమార్, మేనేజర్ యోగేష్, ఏఈ శ్రీనివాస్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ వేణుగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ టి. కృష్ణ, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు కె. అశోక్‌యాదవ్, మాజీ ఎంపీపీ తలారి మల్లేష్, కౌన్సిలర్‌లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి అదృశ్యం

అత్తాపూర్: పనికి వెళ్తున్నానని చెప్పి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... హసన్‌నగర్ ఇంద్రానగర్‌కు చెందిన జాఫర్‌ఖాన్ (38) ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 4వ తేదీన మధ్యాహ్నం పనికి వెళ్తున్నానని చెప్పి ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. ఆ తరువాత ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద జాఫర్‌ఖాన్ ఆచూకీ కోసం ప్రయత్నించిన ఎలాంటి ప్రయోజనం లేకుండాపోయింది. అత్తాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరో సంఘటనలో...

ఇంట్లో ఎవరికి చెప్పకుండా ఓ మహిళ వెళ్లిపోయిన సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అత్తాపూర్ డివిజన్ సిక్‌చానీ ప్రాంతానికి చెందిన సురేందర్‌సింగ్ కుమార్తె మన్‌మీత్ కౌర్ (24)కు 2021 సంవత్సరంలో వివాహం జరిగింది. భార్యాభర్తల మధ్య గొడవల కారణంగా గత రెండు సంవత్సరాలుగా మన్‌మీత్ కౌర్ సిక్‌చానీలోని తల్లిదండ్రుల వద్ద ఉంటుంది. ఈ నెల 5వ తేదీన ఇంట్లో అందరు పడుకున్న సమయంలో ఉదయం 6 గంటలకు ఎవరికి చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. దీంతో కుటుంబ సభ్యులు చుట్టు పక్కల ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద వాకాబు చేసిన ఎలాంటి ఆచూకీ లభించలేదు. ఈ మేరకు అత్తాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

11న మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం

- ఏర్పాట్లు మొదలు పెట్టిన అధికారులు
- గండిపేట మండలానికి చైర్మన్, వైస్‌చైర్మన్ల పదవులు
- కార్యక్రమానికి హాజరుకానున్న పలువురు మంత్రులు


నార్సింగి మార్కెట్ కమిటీ కార్యాలయం

మణికొండ: నార్సింగి మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారం ఈనెల 11వ తేదీన నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కొత్తపాలక కమిటీని ప్రకటించింది. దీంతో వారు ప్రమాణస్వీకారం చేసే కార్యక్రమానికి మంత్రులను ఆహ్వానించాలనే ఉద్దేశంతో ఇప్పటి వరకు వేచి ఉన్నారు. ఎట్టకేలకు వారి సమయం ఖరారు కావటంతో ఏర్పాట్లు మొదలు పెట్టారు. ఇప్పటికే నార్సింగిలోని మార్కెట్ కమిటీ కార్యాలయానికి రంగులు వేసి తీర్చిదిద్దారు. మార్కెట్ ఆవరణలోనే స్టేజీని ఏర్పాటు చేసే పనులను ప్రారంభించారు.

మారిన పద్ధతులు...

నార్సింగి మార్కెట్ కమిటీకి గతంలో చైర్మన్ ఉమ్మడి రాజేంద్రనగర్ మండలానికి ఉంటే వైస్ చైర్మన్ శంషాబాద్‌కు చైర్మన్ శంషాబాద్ మండలానికి ఉంటే వైస్ చైర్మన్ రాజేంద్రనగర్ మండలానికి చెందిన నాయకులు ఇచ్చేవారు. మార్కెట్ కమిటీ ఏర్పడినప్పటి నుంచి ఇదే ఆనవాయితీ కొనసాగింది. అందుకు భిన్నంగా ప్రస్తుత పాలక కమిటీలో చైర్మన్‌తో పాటు వైస్ చైర్మన్‌లను సైతం గండిపేట మండలానికే కేటాయించారు. చైర్మన్ కె. వేణుకుమార్‌గౌడ్ నార్సింగి గ్రామానికి చెందిన నాయకుడు కాగా వైస్ చైర్మన్ కె. దశరథ యాదవ్ పక్కనే ఉన్న మంచిరేవుల గ్రామానికి చెందిని నాయకుడు కావటం విశేషం. తన మిత్రుడైన వేణుగౌడ్‌కు చైర్మన్, తన అన్న అయిన దశరథ్‌యాదవ్‌కు వైస్ చైర్మన్ పదవులు దక్కేందుకు కాంగ్రెస్ పార్టీ నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు కె. అశోక్‌యాదవ్ పావులు కదిపి సక్సెస్ అయ్యారని ఆయన అనుచరులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

విజయవంతం చేయాలి : చైర్మన్ వేణుగౌడ్


నూతన చైర్మన్ వేణుగౌడ్

నార్సింగి మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం ఈనెల 11వ తేదీన నిర్వహిస్తున్నామని, దాన్ని విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున తరలిరావాలని చైర్మన్ వేణుగౌడ్ కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, జిల్లా ఇంచార్జి మంత్రి డి. శ్రీధర్‌బాబు, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లు హాజరవుతున్నారని ఆయన తెలిపారు. వీరిలో పాటు శాసనసభ్యులు, శాసన మండలి సభ్యులు, పలు శాఖల చైర్మన్‌లు హాజరవుతారని ఆయన పేర్కొన్నారు.

ఉచిత ఆరోగ్య శిబిరాలతో ఎంతో మేలు

మణికొండ మున్సిపల్ చైర్మన్ నరేందర్‌ముదిరాజ్



మణికొండ: ఆసుపత్రులు, సేవా సంస్థలు ఏర్పాటు చేసే ఉచిత ఆరోగ్య శిబిరాలతో ప్రజలు ఎంతో మేలు జరుగుతుందని, వాటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మణికొండ మున్సిపల్ చైర్మన్ కె. నరేందర్ ముదిరాజ్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరాంనగర్ కాలనీ కమ్యూనిటీహాల్‌లో శనివారం డాక్టర్ జీఎస్ రావూస్ ఈఎన్‌టీ ఆసుపత్రి, పుప్పాలగూడ శ్రీరాం ఆర్థో, అక్షయ దంత వైద్య శాల, మెడికవర్ ఆసుపత్రులతో కాలనీ సంక్షేమ సంఘం వారు ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రతి ఒక్కరి శరీరంలో ఏదో ఒక ఆరోగ్య సమస్య ఉంటుందని, అలాంటి వాటిని చిన్నగా ఉన్నప్పుడే గుర్తించి డాక్టర్‌ల సలహాలు, మందులతో తగ్గించుకుంటే ఎంతో మేలు జరుగుతుందన్నారు. అలాంటి వారు ఇలాంటి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు జీఎస్‌రావు, శ్రీనివాస్, ఉమ, శ్రీకాంత్‌లతో పాటు కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డి. మనోహర్, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్, నాయకులు కాంతారావు, బాపూజీ, శివరాంరెడ్డి, భరత్, శివరామకృష్ణ, డాక్టర్ ప్రభావతి, సీతారాందాస్, ఆల్ కాలనీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు డాక్టర్ పి.అవినాష్‌లు పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాల బ్రోచర్ విడుదల

మణికొండ: రాబోయే సంక్రాంతి పండగను కమ్మవారంతా కలసికట్టుగా జరుపుకోవాలని హైకోర్టు మాజీ న్యాయమూర్తి చల్లా కోదండరాం అన్నారు. శనివారం మణికొండలో డ్రీం వ్యాలీ గేటెడ్ కమ్యూనిటీ క్లబ్ హౌస్‌లో సంక్రాంతి సంబరాల బ్రోచర్‌ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 5వ తేదీన బాచుపల్లిలోని కేఎల్ యూనివర్సిటీ గ్రౌండ్‌లో ఈ ఉత్సవాలు ఉంటాయన్నారు. లక్ష మందితో ఈ ఉత్సవాలు నిర్వహించటం అభినందనీయమన్నారు. జంట నగరాల కమ్మ సంఘం నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

టీపీయూఎస్ నూతన మండల శాఖ ఏర్పాటు

రాజేంద్రనగర్: టీపీయూఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కోట్ల కాశీరావు ఆధ్వర్యంలో టీపీయూఎస్ (తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం) రాజేంద్రనగర్ నూతన మండల శాఖను ఏర్పాటు చేశారు. మండల గౌరవ అధ్యక్షుడిగా ఎ.వినోద్ కుమార్, మండల అధ్యక్షుడిగా మదగని బాలకృష్ణ, మండల ప్రధాన కార్యదర్శిగా గుంజారి బాలకృష్ణ, కోశాధికారిగా ఆవుల అనిల్ కుమార్, మహిళా కన్వీనర్‌గా బుద్దం విజయమ్మ, మహిళా ఉపాధ్యక్షురాలిగా బి.నాగమణిలు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి టీపీయూఎస్ రాజేంద్రనగర్ మండల సభ్యులు ఎం.పీ రాజు, గోపాల్‌లు పాల్గొని నూతన కమిటీకి, జిల్లా, మండల సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణలో భాగస్వామ్యం కావాలి


మాట్లాడుతున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆవిష్కరిస్తున్న తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. శనివారం కార్పొరేషన్ కార్యాలయంలో సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పాలన విజయోత్సవాలు కార్యక్రమంలో భాగంగా తెలంగాణ సెక్రటేరియట్‌లో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమం చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ పరిధిలోని మహిళలను భాగస్వాములను చేయాలని సూచించారు. అందుకు అధికారులు, సిబ్బంది సమీక్షించి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు అధికారులు, రిసోర్స్ పర్సన్స్ (ఆర్‌పీలు) అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అణగారిన వర్గాలను కాపాడేది ఎర్రజెండానే

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

శంషాబాద్: అణగారిన వర్గాలకు కాపాడేది ఎర్రజెండా మాత్రమేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను శనివారం పట్టణంలోని ఎలైట్ హోటల్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర నాయకుడు ఇటీవల అకాల మరణం చెందిన బాలమల్లేష్‌కు సంతాపం ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మిక వర్గాల్లో రాజకీయ చైతన్యంతో కూడిన సామాజిక విప్లవం రావల్సి ఉందన్నారు. కార్మికుల బాధలు, కష్ట సుఖాలు తెలియని వారినే మనం ఓటు వేసి చట్టసభలకు పంపుతున్నామన్నారు. దీంతో మనకోసం మనబాగు కోసం చట్టం చేసే వారు కాకుండా వారి అవసరాలకు అనుగుణంగా చట్టాలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్‌పాషా, బీకేఎంయూ ప్రధాన కార్యదర్శి నిర్మల్ పాండే, సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్యలు పాల్గొన్నారు.

భారీ వర్షానికి రోడ్లు జలమయం


బుద్వేల్ రైల్వే బ్రిడ్జి ప్రాంతంలో నిలిచిపోయిన వర్షపు నీరు

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఒక్కసారిగా దాదాపు అర గంట పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి రోడ్లు పూర్తిగా జలమయంగా మారాయి. దీంతో దుర్గానగర్, కాటేదాన్, మైలార్‌దేవ్‌పల్లి, ఓల్డ్ కర్నూల్ రోడ్డు, బుద్వేల్ రైల్వే స్టేషన్, ఆరాంఘర్ రైల్వే బ్రిడ్జి తదితర ప్రాంతాల్లో వర్షం నీరు రోడ్లపైకి భారీగా చేరడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో వాహనాదారులు ఈదారి గూండా ప్రయాణించేందుకు తీవ్ర అవస్థలు పడ్డారు. వర్షం నీటితో పాటు డ్రైనేజీ నీరు ప్రవహించడంతో ప్రజలు నరకయాతన పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ట్రాఫిక్ సిబ్బంది, జీహెచ్ఎంసీ సిబ్బంది రంగంలోని దిగి రోడ్లపై నిలిచిన వర్షపు నీటిని తొలగించారు.

నిత్య విద్యార్థినులుగా ఉంటేనే ఉన్నత స్థానాలు

శ్రీదేవి మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.నర్మద


గ్యాడ్యుయేషన్‌డేలో పాల్గొన్న విద్యార్థినులు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

మణికొండ: కళాశాల చదువులు పూర్తయినా జీవితమంతా విద్యార్థినులుగా ఉండి కొత్త విషయాలను తెలుసుకున్నపుడే జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని శ్రీదేవి మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.నర్మద అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ, వట్టినాగులపల్లిలోని కళాశాలలో శనివారం బీటెక్, ఎంబీఏ విద్యార్థినిలకు గ్రాడ్యుయేషన్ డే, పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం సాంకేతిక విప్లవం కొనసాగుతుందని, అందుకు అనుగుణంగా మన ఆలోచనలను సైతం వృద్ధి చేసుకుని చదువులతో పాటు కొత్త విషయాలను తెలుసుకుని మనల్ని మనం తీర్చుదిద్దుకోవాలన్నారు. సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రజలకు అవసరమైన నూతన ఆవిష్కరణ, వాటిని ప్రజల వద్దకు చేర్చటం బాధ్యతలు యువ ఇంజినీర్లపై ఉందన్నారు.

ఈ సందర్భంగా డిపార్ట్‌మెంట్ల వారీగా టాపర్లుగా నిలిచిన విద్యార్థినులకు బంగారు పతకాలను అందజేశారు. పూర్వ విద్యార్థులు తమ కళాశాల నాటి అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్స్ డీన్ డాక్టర్ కె.శివనాగిరెడ్డి, పూర్వ విద్యార్థుల డీన్ రవికుమార్, పరీక్షల నియంత్రణాధికారి కె. తులసీరాం, ఫ్యాకల్టీ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎం. రామసుబ్రమణియన్, అలుమ్ని కోఆర్డినేటర్ ఎం. ప్రగతిలతో పాటు అధ్యాపకులు, వందలాది మంది విద్యార్థినులు పాల్గొన్నారు.

హెచ్ఎండీఏ స్థలాల్లోని అక్రమ నిర్మాణాల కూల్చివేత

- పరిహారం పేచీతో తేలని భూముల పంచాయితీ
- అక్రమ నిర్మాణాలకు అద్దెకిచ్చిన పూర్వపట్టాదారులు


అక్రమ నిర్మాణాల కూల్చివేస్తున్న సిబ్బంది

శంషాబాద్: శంషాబాద్ పట్టణంలో ట్రంపెట్ బ్రిడ్జి సమీపంలోని హెచ్ఎండీఏ స్థలంలో నిర్మాణం చేసిన అక్రమ నిర్మాణాలను శనివారం హెచ్ఎండీఏ జాయింట్ కలెక్టర్ షర్మిల పర్యవేక్షణలో అధికారులు కూల్చివేతలు చేపట్టారు. ట్రంపెట్ బ్రిడ్జి సమీపంలో 2007 హెచ్ఎండీఏ సేకరించిన సుమారు ఐదకరాలకుపైగా స్థలం కూడా హెచ్ఎండీఏ సేకరించినప్పటికీ ఆ స్థలాలకు సంబంధించిన పట్టాదారులు వారి పరిహారం విషయంలో కోర్టును ఆశ్రయించారు. నిర్ణయించిన పరిహారాన్ని హెచ్ఎండీఏ కోర్టులో డిపాజిట్ చేసినప్పటికీ పట్టాదారులు స్థలంలో అనుభవిస్తూ వస్తున్నారని, స్థలాన్ని ఖాళీ చేయాలని పలుమార్లు హెచ్ఎండీఏ అధికారికంగా పలుమార్లు ఆదేశాలు జారీ చేశారు. ఇదిలా ఉండగా గత కొన్నేళ్లుగా సంబంధిత స్థలంలో అప్పటి పట్టాదారులు వాణిజ్యపరమైన కట్టడాలు, హోటళ్లు, హోర్డింగ్‌లకు అద్దెకివ్వడంతో జాతీయ రహదారిపై భారీ ఎత్తున ట్రాఫిక్ జామ్ కావడంతో పాటు విమానాశ్రయానికి రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో హెచ్ఎండీఏ సంబంధిత స్థలాన్ని తమ ఆధీనంలోకి తీసుకునేందుకు చర్యలు చేపట్టింది, ఇందులో భాగంగా స్థలంలోని అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేసింది. మరికొన్ని నిర్మాణాలను రెండు రోజుల్లోపు ఖాళీ చేయాల్సింది హెచ్చరించింది. ఇదిలా ఉండగా అక్రమ నిర్మాణాలు ఏర్పాటు చేసుకున్న వారు హెచ్ఎండీఏ అధికారులతో వాగ్వాదానికి దిగారు. పూర్వ పట్టాదారులు కూడా హెచ్ఎండీఏ తమకు న్యాయం చేయని కారణంగా కోర్టుకు వెళ్లామని న్యాయబద్ధంగా పరిహారం చెల్లిస్తేనే భూములు అప్పగిస్తామన్నారు. ఇదిలా కొందరు పట్టాదారులు హెచ్ఎండీఏ అధికారులకు చూపిన పట్టాదారు పుస్తకాల్లో తహసీల్దార్ సంతకం సైతం లేకపోవడంతో అధికారులు నకిలీ పుస్తకాలుగా తేల్చినట్లు తెలిసింది.


బహిరంగ సభ వద్ద బీజేపీ నాయకులు

సరూర్‌నగర్‌కు తరలిన బీజేపీ నాయకులు


బహిరంగ సభకు బయలుదేరుతున్న బీజేపీ నాయకులు

రాజేంద్రనగర్: బీజేపీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలనపై నిర్వహించిన బహిరంగ సభకు రాజేంద్రనగర్ డివిజన్ నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. శివరాంపల్లి నుంచి బీజేపీ సీనియర్ నాయకుడు హరికిషన్ జీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలన కేవలం మోసపూరిత వాగ్దానాలతో పూర్తయిందన్నారు. సంవత్సర కాలంలో ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు.

సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్ విఫలం

మైలార్‌దేవ్‌పల్లి: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాభివృద్ధి, సంక్షేమాలను పూర్తిగా విస్మరించిందని రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి తోకల శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలన వైఫల్యాలపై నిర్వహించిన ఆరు అబద్ధాలు, 66 మోసాలు అనే నినాదంతో బీజేపీ తలపెట్టిన పోరు సభ కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలివెళ్లారు. కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి, జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా బహిరంగ సభకు రాజేంద్రనగర్ నియోజకవర్గం, మండల స్థాయి, మున్సిపాలిటీల ప్రాంతాల నుంచి నాయకులు, కార్యకర్తలతో కలిసి భారీ ఎత్తున బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలను మోసం చేయడంలో కాంగ్రెస్ పార్టీ నెంబర్ వన్ అన్నారు. రాష్ట్రాన్ని దివాలా తీయించే పరిస్థితికి తీసుకువచ్చిందన్నారు. ఏడాది గడుస్తున్నా ప్రజలకు ఎలాంటి పథకాలు ప్రవేశపెట్టకుండా విజయోత్సవాలు చేసుకోవడం వారి అవివేకానికి నిదర్శమన్నారు.

మున్నూరు కాపు మహిళల అభివృద్ధికి కృషి


తెప్ప అరుణ

అత్తాపూర్: తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు మహిళల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని మున్నూరు కాపు మహిళా పరస్పర సహాయ వినియోగదారుల సహకార సంఘం చైర్‌పర్సన్ తెప్ప అరుణ అన్నారు. శనివారం అత్తాపూర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మున్నూరు కాపుల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయించేందుకు సంబంధిత అధికారులు, కేంద్ర, రాష్ట్ర మంత్రులను కలిసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 11న న్యూఢిల్లీలో కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రిని ప్రత్యేక ప్రతినిధుల బృందంతో కలవనున్నట్లు ఆమె తెలిపారు. మహిళలు వ్యాపార రంగంలో రాణించేందుకు మహిళలకు పెట్రోల్ పంపులు కేటాయించాలని ఆమె కోరారు.

అంబేడ్కర్ విగ్రహ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ చౌరస్తాలోని భారతరత్న డాక్టర్ బి.అంబేడ్కర్ విగ్రహ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని జాతీయ షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సంస్థ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌ను ప్రతినిధులు కలిసి వినతిపత్రం అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహం కింది భాగం నుంచి ప్రవహిస్తున్న డ్రైనేజీని నియంత్రించాలన్నారు. విగ్రహం చుట్టూ సుందరీకరణకు మొక్కల కుండీలు ఏర్పాటు చేయాలన్నారు. ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌తో రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవి కుమార్‌కు సైతం వినతిపత్రం అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్సీఆర్‌పీఎస్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, దళిత సేవారత్న పచ్చ శ్రీనివాస్, జాతీయ విద్యా విభాగం జాతీయ ప్రధాన కార్యదర్శి, దళిత సేవారత్న డాక్టర్ వేము వందనం, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు రత్న, డి.రమేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శి పి. నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL DISTRICT JUDGE, RANGA REDDY DISTRICT :: AT : L.B. NAGAR.
GW.O.P.No. 98 of 2024

Between:
Mrs. Vemula Sravanthi,
Rep. by her General Power of Attorney
Sri Munugoti Sudhakar ...Petitioner
And
All Concerned. ...Respondents
To
All concerned

Please take notice that the Petitioner has filed the above GWOP filed under Section 8 of Hindu Minority and Guardianship Act r/w Section 29 of the Guardians and Wards Act seeking permission from the Hon'ble Court to sell the share of her Minor children Vemula Hansika and Vemula Mehul to the extent of 3/4th in one-half of the below mentioned Schedule of Property. The case is posted on 23-12-2024. Therefore, if any one has any objection for the above claim, he/they may appear either in person or through his/their counsel on that day at 10.30 a.m. before the Hon'ble Court, failing which the matter will be heard to proceed further.

SCHEDULE OF PROPERTY

All that the part and parcel of the Plot bearing Nos. 61 Part and Plot No.62, in Survey Nos. 6, 7 and 8, admeasuring 250 Sq.Yds., or equivalent to 209 Sq.Mtrs., situated at Manikonda Khalsa Village, Gandipet Mandal, under Manikonda Municipality, Ranga Reddy District, which is bounded by:
North : Plot No.61 Part, South : Plot No.63
East : Plot No.71 and 72, West: 25'-0 Wide Road
//BY ORDER OF THE COURT//
DEEPAK CHOWDARY
Advocate
Flat No.101, Krishnaveni Pride, H.No.8-3-833/204, Kamalapuri Colony, Hyderabad- 500 073.
Mob: 9440260885.

IN THE COURT OF THE HON'BLE PRL. DISTRICT & SESSIONS JUDGE. RANGA REDDY DISTRICT AT : L B. NAGAR
G. W. O. P. No. 97 OF 2024

BETWEEN:
Ch. Venkataiah and others ...PETITIONERS
AND
ALL CONCERNED and others ...RESPONDENTS
To,
To whom so ever it may concerned

NOTICE

Please take notice that the petitioner No.1 herein filed above GWOP against the defendants to appoint the Petitioner No.1 as guardian on behalf of the petitioner No.2 and 3 and also seeking direction from the 3rd Respondent to release the total amount which is under deposit in the loan account in the name of the deceased ie., Sakkara Krishnaveni and also in the name of 2nd respondent in favor of the petitioner No.2 and 3 and also Directing the Petitioner No.1 after received the total amount from the 3rd respondent and the same is to deposit after opening bank account in any nationalized bank in the name of the 2nd and 3rd Petitioners to attaining as majors and the interest amount upon the deposited amount every month shall be used for their education purpose etc., The above GWOP is posted to 12-12-2024 for your appearance before the court on.12-12-2024 at 10.30 am, if anybody is having any objection they should be appear before the above Hon'ble court either in the person or through advocate or else the matter will be decided ex-parte and the matter will be decided according to the law.

DESCRIPTION OF DEPOSITED TITLE DEED OF IMMOVABLE SCHEDULE PROPERTY

All the Rights, House bearing Municipal No.3-2/48, on Plot bearing No.48, in Sy. Nos.2/A, 1,2/A2, 2/A3, 2/A4, 2/A5, 2/E2, 3/A 2/E 1, and 3/A, admeasuring 142.00 Sq. Yards, equivalent to 118.71 Square Meters, built up Area 2330.00 Square Feet (R.C.C), situated at BAIRAGIGUDA VILLAGE, Bandlaguda Jagir Municipal Corporation, Gandipet Mandal, Ranga Reddy Dist., Telangana State and bounded as under:
NORTH: 30'-0' Wide Road, SOUTH: Bairagiguda Village Road, EAST: Plot No.49/Part, WEST: Plot No.47.
(By order of the Hon'ble Court).
Sd/- **N. BHAVANI SANKAR**
Advocate
H.No. 2-2-72, Upperpally, Hyderguda, Hyderabad-48. Cell No.9000519567.